# కామెడీ కథ

# ఐ గెట్ వాట్ ఐ వాంట్...

విశ్లేష డామ్ సీరియస్‌గా ఆలోచిస్తోంది.

ఓసారి చిన్న డౌటొచ్చి తన చీరని మోకాలి వరకూ జరిపి చూసుకుంది, తెల్లటి పాదాలు, అందమైన సెక్సీ లెగ్స్...

''ఏయ్ విశ్లేషా! నీవి సెక్సీ లెగ్స్ తెలుసా?!'' మొగుడన్న మాటలు గుర్తొచ్చి సిగ్గుపడిపోయింది.

"సిగ్గుపడ్డది చాలుగానీ, అసలు సంగతి చూడు" అంతరాత్మ వార్న్ చేసేసరికి, కర్తవ్యం గుర్తొచ్చి మోకాలి వంక పరిశీలనగా చూసుకుంది.

మోకాలిలో తన మెదడు వున్న దాఖలాలు లేవు. అంటే తన తలకాయలోనే తన మెదడు వుందన్న మాట.

అయినా తన మొగుడు చేసే నిర్వాకాల్ని, తనెలా బావురుకప్పలా నోరు తెరిచి చూస్తూండిపోతుంది.

అతడి సంగతేమిటో తేల్చాలి.

"హమ్మ... హమ్మ... ఎంత తెలివిగా తనని మేనేజ్ చేస్తూ వచ్చాడు. ఒక్క క్షణం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళిపోయింది విశ్లేష.

* * *

అది విశ్లేష పెళ్ళయిన రోజు.

ఫస్ట్ నైట్ ఏర్పాటు చేసిన రోజు కూడా.

మూడొచ్చే ఇంగ్లీష్ మ్యూజిక్, మత్తెచ్చే ఫెర్ఫ్యూమ్ లాంటి ఎక్స్‌ట్రా డెకరేషన్స్‌తోపాటు, రెగ్యులర్ పందిరి మంచం, స్వీట్స్, అగరొత్తులు షరా మామూలే.

విశ్లేషను గదిలోకి తోశారు.

స్పీడ్‌గా గదిలోకి ఎంటరయింది విశ్లేష.

ఎదురుగా తన బెటరాఫ్ సిద్ధార్థ.

తనిప్పుడు సిగ్గుపడుతూ అతని దగ్గరికెళ్ళి నిలబడాలా?

అతనేమో తన భుజం మీద చేయేస్తాడు... 'అబ్బ! పట్టుకుంటే జారిపోతూంది. ఏం సబ్బు వాడుతారు' అంటూ జోకేస్తాడు. పట్టుకుంటే జారిపోయే చర్మం నా చర్మ సౌందర్యం... ఫలానా సోప్ అనాలా

సిద్ధార్థ విశ్లేష దగ్గరకి వచ్చాడు.

ఏసీ చల్లదనం హాయిగా వుంది. సిద్ధార్థ విశ్లేష భుజం మీద తలపెట్టి బాదుకుంటూ...

"నేను పాపిని... నేను అసమర్థుడ్ని... భార్యను సుఖపెట్టలేని అధముడ్ని... నన్ను క్షమించు విశ్లేషా... నన్ను క్షమించు..." అన్నాడు.

"అదేమిటండీ? అంత మాట అనేశారు" అంది విశ్లేష ఆశ్చర్యంగా.

"ఏం చెప్పమంటావు విశ్లేషా, ఏం చెప్పమంటావు"

"అలా రెండుసార్లు చెప్పడం ఆపి, అసలు విషయం చెప్పండి" అంది విశ్లేష.

"ఏం చెప్పమంటావు విశ్లేషా... ఇంట్లో నీకో కూలర్ కూడా కొనిపెట్టలేని అసమర్థుడ్ని. నన్ను క్షమించు విశ్లేషా... నన్ను క్షమించు"

విశ్లేషకు సీన్ అర్థమైంది.

"అంటే యింట్లో కూలర్ లేదని నేను మిమ్మల్ని సతాయించొద్దన్నమాట" అంది విశ్లేష.

టపటపా రెండు ఆనందభాష్పాలు రాల్చి... కళ్ళు టప టపలాడించి, 'అవునన్నట్టు' తలూపాడు.

"పోన్లెద్దురూ... వెధవ కూలర్ లేకపోతే ఏమిటట? మీరు నాకు కూలర్ కొనిపెట్టలేకపోయినందుకు ఎంత ఫీలవుతున్నారో ఫస్ట్‌నైటే అర్థమయింది" అంది విశ్లేష.

"థాంక్యూ విశ్లేషా... థాంక్యూ" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"ఫర్లేదు" అంది విశ్లేష

"థాంక్యూ విశ్లేషా" మళ్ళీ అన్నాడు ఆనందం పట్టలేక.

"ఈమాత్రం దానికే థాంక్స్ ఎందుకూ. అయినా భార్యాభర్తల మధ్య 'థాంక్స్' ఎందుకు?" అంది.

అంతే...

* * *

మూడు రాత్రుల ముచ్చట్లు ఐస్‌ఫ్రూట్‌లా కరిగి, రొటీన్ లైఫ్ అనే పుల్ల మిగిలేక, ఓరోజు ఏడున్నరకు వచ్చేడు సిద్ధార్థ.

ఆరు గంటల నుంచి ఎదురుచూస్తోంది విశ్లేష. అప్పటికే ఆమెకు ఒళ్ళు మండిపోతోంది. మనసు రాజస్థాన్ ఎడారే అయింది.

సిద్ధార్థ వస్తూనే సోఫాలో విచారంగా కూచున్నాడు. ఆ తర్వాత విశ్లేష దగ్గరకి వెళ్ళి డ్రమెటిగ్గా నేలమీద వున్న కార్పెట్ మీద కూర్చొని, సోఫాలో కూచొని వున్న విశ్లేష ఒడిలో తలపెట్టి...

"నాలాంటి వాడిని పెళ్ళి చేసుకోవడమే నువ్వు చేసిన తప్పు విశ్లేషా. నన్ను క్షమించు విశ్లేషా... నన్ను క్షమించు. ఛీ...ఛీ... నేను వెధవని, స్టుపిడ్‌ని, ఎర్లీగా యింటికి వచ్చి భార్యను సర్‌ప్రయిజ్ చేసి, సంతోషపెట్టలేని చవటని" అంటూ వాపోయేడు.

భర్త అలా రియలైజ్ అవటం చూసి తన సీరియస్‌నెస్‌ని తగ్గించుకొని-

"అసలేమైందండీ" అంటూ ఆరా తీసింది.

"ఏం చెప్పమంటావు విశ్లేషా, పని... పని విశ్లేషా పని. బాస్ మొగుడు బండచాకిరీ చేయమంటాడు. అప్పటికీ అయ్యో, నా విశ్లేష నాకోసం ఎదురుస్తోందని నా మనసు తెగ బాధపడిపోతూనే వుంది" అంటూ తలని సోఫాకేసి బాదుకున్నాడు.

"అయ్యయ్యో... మీరు మాత్రం ఏం చేస్తారు. మీకు మాత్రం పెందరాళే యింటికి రావాలని వుండదా ఏం? పోన్లెండి... యివాళ్టికి యింతే ప్రాప్తం అనుకుందాం. రేపట్నుంచి పెందరాళే వచ్చేయండి" అంది అనునయంగా.

"అయ్యో.. విశ్లేషా... నీలాంటి మంచిదాన్ని, నాలాంటి అసమర్థుడికి ఎందుకు ముడిపెట్టాడో ఆ దేవుడు" మళ్ళీ వాపోయాడు.

"అదేమిటండీ?"

"అదేమిటంటే ఏం చెప్పమంటావు... ఆఫీసరు పీనుగ, రోజూ సెవెన్ థర్టీ వరకూ పన్జేసి చావమన్నాడు" చెప్పాడు సిద్ధార్థ.

ఒక్కక్షణం మౌనంగా వుండి "పోన్లెండి" అంది భర్త పశ్చాత్తాపం చూసి.

అదిగో అలా మొదలైంది సిద్ధార్థ స్టయిల్.

ఓ రోజు విపరీతంగా పశ్చాత్తాపపడి "పెళ్ళానికి నెక్లెస్ కొనిపెట్టలేని అసమర్థ స్టుపిడ్‌ని" అని తనను తాను తిట్టుకుంటాడు.

మరో రోజు "ఛ...ఛ... కనీసం పండుగకు పట్టుచీర అయినా కొనిపెట్టలేని వాడిని. నీలాంటి మంచి భార్యను అర్థం చేసుకునే భార్యను సుఖపెట్టలేనందుకు బాధపడుతున్నాను" అంటూ ఓ కాటన్ చీర చేతిలో పెట్టాడు.

తనకు పట్టుచీర కావాలని వున్నా, నెక్లెస్ కొనుక్కోవాలని వున్నా, భర్త ముందే పశ్చాత్తాపపడ్డంతో ఏమనలేక, కొసమెరుపుగా తనే భర్తని ఓదారుస్తూ వుండిపోతుంది.

ఇలా సదరు సిద్ధార్థ నామధేయుడు ప్రతీ విషయానికి ముందే లెంపలు వేసుకొని, తల బాదుకొని, క్వింటాళ్ళకొద్దీ పశ్చాత్తాపం నటించి, ఎస్కేప్ అవుతూ వున్నాడు.

ఓరోజు అదృష్టం సైడయింది. సూపర్ మార్కెట్ నుంచి వస్తోన్న విశ్లేష, టాంక్‌బండ్ మీదుగా వస్తూ తన మొగుడు, గోపాలం అనే స్నేహితుడితో అమ్మాయిలను కామెంట్ చేస్తూ ఎంజాయ్ చేయడం గమనించింది.

తర్వాత్తర్వాత అన్నీ ఆరా తీస్తే (ఐదొందలు ఖర్చు పెట్టి ప్రైవేటు డిటెక్టివ్‌తో) మొగుడికే శాల్తీ ఐదున్నరకే ఆఫీను నుంచి బయటకు వచ్చేస్తున్నాడని, అతనికి డబ్బు సమస్య లేదని, సాయంత్రాలు జల్సాగా తిరుగుతున్నాడని అర్థమైంది.

వెంటనే యాక్షన్‌లోకి దిగింది. తన ఫ్రెండ్ షర్మిల గుర్తొచ్చింది. హాస్టల్‌లో తను, స్వప్న, షర్మిల మంచి ఫ్రెండ్స్. షర్మిల మహా యాక్టివ్.

అనుకున్నదే ఆలస్యం... షర్మిల దగ్గరకి వెళ్ళింది. బ్లూ జీన్స్ మీద వైట్ టీషర్ట్ టక్ చేసి, శీర్షాసనం వేస్తూ తన ఫ్రెండ్‌కు సలహా యిచ్చింది షర్మిల.


దాని పేరే ఆపరేషన్ 'ఐ గెట్ వాటై వాంట్'.

* * *

"ఒరే గోపూ..."

"ఏంట్రా సిద్దూ..."

"రియల్లీ నువ్వు గ్రేట్‌రా. నువ్వు చెప్పినట్టే ఫాలో అవుతున్నా. ప్రతీదానికీ 'రియలైజేషన్' నటించి బుట్టలో వేస్తున్నా. యిప్పుడు ఆలస్యంగా వెళ్ళినా, మల్లెపూలు తీసుకెళ్ళకపోయినా, పట్టు చీరలు కొనలేకపోయినా 'పోన్లెండి పాపం... మీరు మాత్రం ఏం చేస్తారు' అంటుంది" అన్నాడు సిద్దార్థ.



"దట్స్ గుడ్... యిలాంటి విషయాల్లో పెళ్ళాన్ని ముందే కంట్రోల్‌లో పెట్టుకోవాలిరా. పెళ్ళయిన కొత్తలో యమక్రేజుగా వుంటుంది. ఠంచన్‌గా ఐదున్నరకే వెళ్తాం. ఆ తర్వాత్తర్వాత ఆరు ఏడవుతుంది. గొడవ మొదలవుతుంది. పూలు తీసుకురాకపోతే ఓ గొడవ, నెక్లెస్ లేకపోతే మరో గొడవ. నెలకో పట్టు చీర తీసుకురాకపోతే గొడవ... వీటన్నింటికీ పరిష్కారం ముందు మనల్ని మనం తిట్టుకొని, సింపతీ గెయిన్ చేయడం. ఛస్తే జీవితంలో మనల్ని ఏమీ అడగరు. కాకపోతే రోజూ నిన్ను నువ్వు బూతులు తిట్టుకోవాలి. అవసరమైతే తల బాదుకోవాలి. చెంపలు వేసుకోవాలి. యివే నీ పెట్టుబడి. దీంతో నీకు బోల్డు సేవ్. లేకపోతే పెళ్ళాం కోరికలకు అంతు వుండదు" హితోపదేశం చేసేడు గోపాలం.

"అవున్నేయ్ గోపూ..." అన్నాడు తన్మయత్వంగా సిద్దార్థ. ఆ క్షణం తన బ్రతుకు హుసేన్‌సాగర్ కంపు అవుతుందని తెలీదు సిద్దార్థకు.

* * *

సిద్దార్థ, సిక్స్త్‌సెన్స్ ఏదో వార్నింగ్ యిష్యూ చేసింది.

అతను లోపలికి అడుగుపెట్టగానే, భార్య మొహంలో క్వింటాళ్ళ కొద్దీ విషాదం కనిపించింది.

"ఏంటీ విశ్లీ... ఏమైంది?" అడిగాడు భార్యను ముద్దుగా.

"నన్ను క్షమించండి... నా పాపానికి నిష్కృతి లేదు. మీ ఆయన చాలా మంచివాడు. అతనేమీ అనడు అని పక్కింటి పిన్నిగారు బలవంతం చేస్తే, ఐదు పట్టుచీరలు కొన్నాను. డబ్బు మీ దగ్గర కలెక్ట్ చేసుకోమని షాపతనికి చెప్పాను. నన్ను క్షమించండి. నా పాపానికి నిష్కృతి లేదు" అంటూ కార్పెట్ మీద కూలబడి భోరుమంది.

వచ్చి వెలక్కాయ, మామిడి టెంకతో మిక్సయి, గొంతులో అడ్డుపడ్డ ఫీలింగ్ కలిగింది. అయినా ఏమనలేక,

"యిట్సాల్‌రైట్" అన్నాడు.

* * *

"అయినా నాకు బుద్ధి రాలేదు. అనుక్షణం మీ మంచితనమే గుర్తొస్తోంది. అందుకే క్రెడిట్‌కార్డుతో ఓ నెక్లెస్ కొన్నాను. నన్ను క్షమిస్తారు కదూ... నన్ను క్షమిస్తారు కదూ" అంటూ మొగుడుగారి చొక్కా గుండీలు పీకుతూ అడిగింది.

మండింది సిద్దార్థకు... అయినా హెల్ప్‌లెస్.

* * *

మరో రోజు యింకో షాక్.

రాత్రి తొమ్మిదిన్నరకు వచ్చింది. సిద్దార్థ డూప్లికేట్ 'కీ' లేక బేవార్స్ మొహం వేసుకొని, ఇంటిముందు 'అక్కుపక్షి'లా కూచున్నాడు. విశ్లేష ఆటో దిగుతూనే మొగుడ్ని చూసి, గబగబ తాళం తీసి, మొగుడి కాళ్ళమీద పడి తల బాదుకుంటూ (బాదుకున్నట్టు నటిస్తూ)-

"ఛ...ఛ... నాకు బుద్ధిలేదు. మీలాంటి మంచి భర్తను కష్టపెడుతున్నా. నా ఫ్రెండ్‌కు హెల్త్ బాగా లేదంటే హాస్పిటల్‌కు వెళ్ళొస్తున్నా. మిమ్మల్ని కావలా కుక్కలా యింటిముందు వెయిట్ చేయించాను, దుర్మార్గురాలిని" అంటూ ఏడుపు సీన్ మొదలెట్టింది.

తను తిట్టకముందే, తనని తానే తిట్టుకుంటోన్న భార్యను చూసి, భార్యను తిట్టలేక, తనను తానే తిట్టుకుంటూ, ఆ రాత్రంతా కుమిలి కుమిలి ఏడ్చి, డిస్సైడైపోయేడు...

ఇదంతా భార్య ప్రతీకార చర్య అని, చైన్ రియాక్షన్ అని అర్థమైపోయింది.

అందుకే ఆ రాత్రే, కాళ్ళ బేరానికి వచ్చాడు.

"నాకు బుద్ధొచ్చింది. నువ్వీ పశ్చాత్తాప డ్రామా దుకాణాన్ని కట్టేయ్" అన్నాడు ఏడుపు మొహంతో.

మనసులోనే తన ఫ్రెండ్ షర్మిలకు థాంక్స్ చెప్పుకొని, "మీరు సిన్సియర్‌గా వుండండి. నేనూ సిన్సియర్‌గా వుంటాను. కష్టమ్నీ, సుఖమ్నీ పంచుకుందాం. ఒకర్నొకరం మోసమ్ని చేసుకోకుండా" అంది ఫైనల్ టచప్ యిస్తూ విశ్లేష.

బుద్ధొచ్చిన సిద్దార్థ, ఆ తర్వాత ఎప్పుడూ భార్య ముందు పశ్చాత్తాపం నటించలేదు.

రజనీ శకుంతల